ప్రజాశక్తి
శుక్రవారం 31, మార్చి 2023



పది పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డిఇఒ

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పది పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని డిఇఒ సాయిరాం ఆదేశించారు. అనంతపురం జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు జరగనుండడంతో నగరంలోని పలు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం గురువారం ముందస్తుగా తనిఖీ చేశారు. నగరంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, లక్ష్మీ సినర్జ్ పాఠశాల, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల, నారాయణ, చర్చి స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో సౌకర్యాలు, బల్లలు ఏర్పాటు గురించి ఆయా పాఠశాలల యాజమాన్యంతో చర్చించారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..!

2014 ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ మరోమారు అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి రావడానికి ముందు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీలన్నింటినీ అమలు చేస్తామని ప్రకటించింది. అయితే ఈ హామీల అమలు, బిజెపి విధానాల వల్ల జిల్లాకు జరుగుతున్న అన్యాయం, నష్టంపై 'ప్రజాశక్తి' వరుస కథనాలను అందివ్వనుంది. ఈ నేపథ్యంలోనే ప్రపథమ హామీ అయిన విభజన చట్టంలో జిల్లాకు వచ్చిన కేంద్రీయ విశ్వవిద్యాలయం చూస్తే అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది.



అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు అయింది. ఇది ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. బడ్జెట్‌లో కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. దీంతో ఇప్పటికీ తాత్కాలిక భవనాల్లోనే విశ్వవిద్యాలయం కార్యకలాపాలు నడుస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవు. చదువు చెప్పే అధ్యాపకులూ లేరు. వీటి నడుమే గతేడాది మొదటి సంవత్సర బ్యాచ్ కూడా బయటకు వెళ్లింది. ఈ కష్టాలన్నీ చూసి కొత్తగా వచ్చే విద్యార్థులు ఈ యూనివర్సిటీకి రావడానికి భయపడిపోతున్నారు.

బాలారిష్టాలు దాటని కేంద్రీయ విశ్వవిద్యాలయం

నిధుల కేటాయింపులు నిల్

ఐదేళ్లుగా నిధులు అరకొరే..

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని 2018వ సంవత్సరంలో అప్పటి మానవ వనరుల శాఖ మంత్రి అయిన ప్రకాశ్ జవదేకర్ ప్రారంభించారు. జెఎన్‌టియు కళాశాలలోని ఇంక్యూబేషన్ కేంద్రంలో తాత్కాలిక క్యాంపస్ కింద దీన్ని ప్రారంభించారు. త్వరితగతిలోనే కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని శాశ్వత ఏర్పాటు చేస్తామని అప్పుడు ఆయన ప్రకటించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బుక్కరాయసముద్రం మండలంలోని జంతలూరు వద్ద 400 ఎకరాల భూమిని సైతం కేటాయించింది. అయితే ఇది ప్రారంభమైనప్పటికీ నిధుల కేటాయింపులు ఆ స్థాయిలో జరగడం లేదు. 2020-21 సంవత్సరంలో రూ.4.80 కోట్లు కేటాయించారు. 2021-22 సంవత్సరంలో రూ.60.35 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. కానీ సవరించిన బడ్జెట్‌లో దీన్ని రూ.20.11 కోట్లకే కుదించారు. ఇక 2022-23 సంవత్సరానికి గానూ రూ.56.6 కోట్లు మాత్రమే కేటాయించారు. సవరణ బడ్జెట్ రూ.13.08 కోట్లుకు తగ్గిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.47.40 కోట్లు కేటాయించారు.

వసతి లేదు..అధ్యాపకులూ లేరు..

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చేరేందుకు విద్యార్థులు ఇక్కడికి విచ్చేస్తున్నారు. ఏడు కోర్సులు ప్రస్తుతం నడుస్తున్నాయి. సుమారు 700 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరికి వసతి గృహాలు లేవు. తాత్కాలికంగా వసతిని అధికారులు ఏర్పాటు చేసిశారు. అయితే ఆ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఇవి అందరికీ సరిపోవడం లేదు. దీంతో విద్యార్థులు బయట ఉండాల్సి వస్తోంది. దీంతోపాటు పూర్తి అధ్యాపక నియామకాలు సైతం ఇప్పటి వరకు జరగలేదు. ఇప్పుడున్న కోర్సులను బట్టి, విద్యార్థులకు అనుగుణంగా 88 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉంది. కాని కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. వారు కూడా అతిథి అధ్యాపకులుగానే బోధన చేస్తున్నారు. శాశ్వత నియామకాలు జరిగేది ఎన్నటికో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికీ శాశ్వత భవనాలకు దిక్కులేదు

ఐదేళ్ల క్రితం విశ్వవిద్యాలయం ఏర్పాటైనా ఇప్పటికీ శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టిన దాఖలాల్లేవు. తాత్కాలిక భవనాల్లోనే ఇప్పటికీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడా సరైన వసతులు లేక విద్యార్థులు పలుమార్లు విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. అయినా వాటి మెరుగునకు చర్యలు చేపట్టలేదు. జంతలూరు వద్దనున్న 400 ఎకరాల భూమి కేటాయించినప్పటికీ ప్రహరీ నిర్మాణాలకే పరిమితమైంది.

నిధులు కేటాయించాలి

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించాలి. విశ్వవిద్యాలయం ఏర్పాటై ఇప్పటికే నాలుగేళ్లు పూర్తయింది. మౌళిక సదుపాల్లేక ఇక్కడ చదివేందుకు వస్తున్న విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు ప్రస్తావిస్తే విద్యార్థులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఇక్కడి సమస్యలు చెప్పుకునేందుకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

- సూర్యచంద్ర, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

రమాదేవి హత్య కేసులో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రమాదేవి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇటీవల హత్యకు గురైన నార్పల మండలం, బొందలవాడ గ్రామానికి చెందిన దళిత రమాదేవి కుటుంబ సభ్యులను రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ పరామర్శించారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా దళిత నేతలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన వసతులన్నీ ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు సెంట్ల ఇంటి స్థలం, వ్యవసాయ పొలం, మూడు నెలలు నిత్యావసర సరుకులు ఇస్తారని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అక్కడే ఉన్న ఆర్‌డిఒ మధుసూదన్‌కు పలు సూచనలు చేశారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జన్నే చిరంజీవి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు హనుమంతు, రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.నరసింహులు, రాయలసీమ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, అప్పా టీం జిల్లా అధ్యక్షులు చిన్న ఆంజనేయులు, యువసేన జిల్లా అధ్యక్షులు శ్రీ రాఘవ, యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ టిసి.నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర, జిల్లా నాయకులు బాల నాగేంద్ర, బండి మహేష్, లక్ష్మీనారాయణ, రాళ్లపల్లి చంద్రశేఖర్, సాకే నరసింహులు, పాలవాయి సుధాకర్, కన్నేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాలికొచ్చిన ప్రభుత్వం..గాలికే పోతుంది..

దామాషా పద్ధతి ప్రకారం వక్కలిగలకు నిధులు కేటాయిస్తాం

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-పెనుకొండ

గాలికొచ్చిన ప్రభుత్వం.. గాలికే పోతుంది..అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. గురువారం పెనుకొండ మండలం హరిపురం సమీపంలోని విడిది కేంద్రం నుంచి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. హరిపురం గ్రామస్తులతో మాటామంతి చేపట్టారు. ఎర్రమంచి వద్ద కియా కార్ల పరిశ్రమ ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించారు. అమ్మవారిపల్లిలో స్థానికులతో భేటీ అయ్యారు. లోకేష్ పాదయాత్ర 700 కిలోమీటర్లకు చేరిన సందర్భంగా గుట్టూరు గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గుట్టూరులో రహదారి పక్కన వక్కలిగ సామాజిక వర్గీయులతో ముఖాముఖి నిర్వహించారు. పలు సమస్యలను వారు లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్లను నిర్మించాలని కోరారు. వక్క తోటలు, మల్బరి రైతుల ఇబ్బందులను లోకేష్‌కు వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే అందరి సమస్యలూ పరిష్కరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. జగన్ రాయలసీమ బిడ్డ కాదని.. సీమకు పడ్డ క్యాన్సర్ గడ్డ.. అని ఎద్దేవా చేశారు. గాలికొచ్చిన ప్రభుత్వం..గాలికే పోతుందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దామాషా పద్ధతి ప్రకారం వక్కలిగలకు నిధులు కేటాయిస్తామని అన్నారు. వక్కలిగలను టిడిపి రాజకీయంగా ప్రోత్సహిస్తుందన్నారు. గతంలో వక్కలిగలను మంత్రి, ఎమ్మెల్యే చేసిన ఘనత టిడిపిదే అన్నారు. ఎన్టీఆర్ హయాంలో హెచ్‌బి.నరసయ్యకు న్యాయశాఖ మంత్రిగా అవకాశం కల్పించామన్నారు. పట్టు రైతులకు ఈ ప్రభుత్వం పెట్టిన రూ.45 కోట్ల బాకీని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మడకశిరలో వక్క మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సీమకు తెచ్చిన నీరు వృథా కాకుండా డ్రిప్ ద్వారా పంటలకు అందించామన్నారు. 90 శాతం సబ్సీడీతో డ్రిప్ ఇస్తుంటే జగన్ రద్దు చేశాడని తెలిపారు. మడకశిర పరిధిలో టిడిపి హయాంలో పట్టు రైతులకు 1000 షెడ్లు నిర్మించామన్నారు. హంద్రీనీవా కాలువ పనులు 90 శాతం పూర్తి చేశామన్నారు. 10 శాతం పనులు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం వైసిపి అని ఎద్దేవా చేశారు. వక్కలిగలను ఒబిసిలో చేర్చడంపై బిసి కమిషన్ నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. టిడిపి హయాంలో తెలంగాణలో చదివే ఏపీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చామని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చాక పెద్దలతో చర్చించి కర్నాటక, తమిళనాడులో చదివే ఏపి విద్యార్థుకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. స్థానికంగా మంచి కాలేజీలు, యూనివర్సీటీలు తీసుకొస్తే బయటకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. వైసిపి ప్రభుత్వం అడ్డగోలుగా బిసిలపై కేసులు పెడుతోందని, టిడిపి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే బిసిల భద్రతకు ప్రత్యేక చట్టాన్ని తెస్తామని స్పష్టం చేశారు. కేసులు రివ్యూ చేయడానికి జిల్లా స్థాయిలో కమిటీ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు వైసిపి ప్రభుత్వం తొలగించడంతో 16 వేల పదవులను బిసిలు కోల్పోయారన్నారు. టిడిపి స్థాపనతోనే బిసిలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసే బాధ్యతను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుంటుందని నారా లోకేష్ హామీ ఇచ్చారు. అనంతరం లోకేష్ యువగళం పాదయాత్ర చెన్నేకొత్తపల్లి మండలం కోన మలుపు వద్ద విడిది కేంద్రానికి చేరుకుంది. రాత్రి లోకేష్ అక్కడే బస చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల క్రిష్టప్ప, గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసమూర్తి, వక్కలిగ నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.



గుట్టూరులో వక్కలిగ సామాజిక వర్గీయులతో మాట్లాడుతున్న నారా లోకేష్



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్‌పి ఫక్కీరప్ప దంపతులు

సీతారాముల కల్యాణంలో ఎస్పీ దంపతులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ హెడ్ క్వాటర్స్‌లోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి దంపతులు కుటుంబ సమేతంగా హాజరై సీతారాముల కళ్యాణం నిర్వహించారు. జిల్లాలో వర్షాలు బాగా కురిసి రైతుల ఇంట సిరులు కురియాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోసాలతో జీవించాలని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, ఎ.హనుమంతు (ఎఆర్) దంపతులు, ఎస్‌బి సిఐ చక్రవర్తి, డిసిఆర్‌బి సిఐ విశ్వనాథ్ చౌదరి, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, సరోజ, రామాలయం కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, నాగరాజు, లింగమయ్య, ఆర్ఎస్ఐ లు రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, ప్రవీణ్ కుమార్, రమేష్ నాయక్, రిటైర్డ్ పోలీసు అధికారులు, పోలీసు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మృతుల్లో భార్యాభర్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలోని వడ్డుపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన బోయ రామచంద్ర (52), భార్య ముత్యాలక్క (48) ఆత్మకూరు నుంచి అనంతపురం ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వడ్డుపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రామచంద్ర ఆర్డీటీ సంస్థ ప్రధాన కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య ముత్యాలక్క అనంతపురంలో పూలు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. ఇందులో భాగంగానే భార్యాభర్తలు ఇద్దరూ రోజూ ఆత్మకూరు నుంచి అనంతపురానికి వచ్చి వెళ్తుండేవారు. ఈనేపథ్యంలోనే ఇద్దరూ తెల్లవారుజామున అనంతపురానికి వెళ్తుండగా ఐచర్ రూపంలో మృత్యువు వెంటాడింది. మృతులకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంగడుయాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామచంద్ర, ముత్యాలక్క (ఇన్‌సెట్‌లో) పాతచిత్రాలు

నత్తనడకన 'నాడు నేడు'

- నిధుల లేమితో ఎక్కడి పనులు అక్కడే

- పాఠశాలల్లో పూర్తికాని పనులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నాడు నేడు పథకం ద్వారా రూ.కోట్లు కేటాయించి ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆయా పాఠశాలలకు మంజూరైన నిధులతో ఎంతో అట్టహాసంగా పనులు ప్రారంభించారు. అయితే నిధులు లేమితో నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం నాడు నేడు రెండో విడత కింద మండలవ్యాప్తంగా దాదాపు పరిధిలో 20 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈమేరకు రూ.59.66కోట్లు కేటాయించారు. తొలి విడతగా రూ.17.54కోట్లు, రెండో విడత కింద రూ.47.52లక్షలు పాఠశాలల ఖాతాలకు జమచేశారు. ఈనేపథ్యంలో ఆయా పనులు లక్ష్యం మేరకు ముందుకు సాగకపోవడంతో పాఠశాలల హెచ్ఎంలు, తల్లిదండ్రుల కమిటీలు, పర్యవేక్షణ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు అసంపూర్తి పనులతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏపని పూర్తి చేద్దామన్నా నిధుల కొరత వెంటాడుతోంది. ఇప్పటికే ఇచ్చిన అరకొర నిధులతో ఎక్కువ మంది ఇసుక, ఇటుక రాళ్లకు ఖరీదు చేశారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన మెటీరియల్ కూడా అరకొరగానే వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అసంపూర్తి మరమ్మతులతో ఆయా విద్యాలయాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఈ కోవలోనే మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాల అభివృద్ధికి రూ.47.64 లక్షలు మంజూరు కాగా తొలి విడతగా రూ.13.61లక్షలు ఇచ్చారు. రెండో విడత రూ.6.51 లక్షలు మంజూరు చేశారు. అయితే కేంవలం రూ.20.12లక్షలు మాత్రం మంజూరు కావడంతో పనులు నత్తనడకనసాగుతున్నాయి. వీటితోపాటు మండలంలో నాడు, నేడు పథకం కింద మంజూరైన ప్రతి పాఠశాలలో ఇదే పరిస్థితి అని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాడు-నేడు పథకానికి పూర్థిస్థాయిలో నిధులు మంజూరు చేసి పాఠశాలలను అభివృద్ధి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.



ఆత్మకూరులో అసంపూర్తిగా మిగిలిపోయిన నాడు-నేడు కింద చేపట్టిన పనులు

ప్రజాశక్తి
www.prajasakti.com



సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ఉరవకొండ : వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని స్వగృహంలో పలువురు లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఉరవకొండ మండలం షేక్షానుపల్లి గ్రామానికి చెందిన మాదిగ రేణుకమ్మ అనారోగ్య బారిన పడి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంది. దీంతో సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో రూ.1,16,000 మంజూరైంది. దీంతో శివరామిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల వైసిపి నాయకులు గుర్రం రామాంజనేయులు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

విప్ 'కాపు' ఇసుక దందా

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాపు రామచంద్రారెడ్డి నాయకత్వంలో వైసిపి నాయకులు రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని హగరి నది నుంచి పెద్దఎత్తున కర్నాటకకు ఇసుక తరలిస్తున్నారని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇందులో భాగంగానే గురువారం డి.హీరేహాల్ మండలం నుంచి బళ్లారికి ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను కర్ణాటక పోలీసులు పట్టుకున్నారన్నారు. నాడు-నేడు పనుల ముసుగులో టిప్పర్ల ద్వారా ఇసుకను బళ్లారి, బెంగుళూరు నగరాలకు తరలిస్తూ రూ.కోట్లు కొల్లగొడుతున్నాడని విమర్శించారు. విప్ కాపు ఇసుక, మద్యం స్మగ్లింగ్‌లో రాయదుర్గాన్ని అడ్డాగా మార్చుకున్నాడన్నారు. డి.హీరేహాల్ మండలంలోని తిమ్మలాపురం, కాదలూరు తదితర ప్రాంతాల నుండి మార్కెట్ యార్డు ఛైర్మన్ భోజరాజనాయక్ మరికొందరు వైసిపి నాయకులు రోజూ ఇసుకను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న వాస్తవాన్ని తనతోపాటు ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. తాను కాపు అక్రమాలను ప్రశ్నించే ప్రతిసారి అతని అక్రమ లావాదేవీల్లో భాగస్వామిగా ఉన్న భోజరాజు నాయక్ పేర తప్పుడు ప్రకటనలు ఇప్పిస్తుంటాడన్నారు. వారు తనపై ఎంతగా దిగజారి తప్పుడు ప్రచారం చేయించినా అవినీతిని ఎండగడుతూనే ఉంటానన్నారు.



బళ్లారి పోలీసులు సీజ్ చేసిన డి.హీరేహాల్ వైసిపి నాయకుడి ఇసుక టిప్పర్

'కాలవ'కు మతి భ్రమించింది

మార్కెట్ కమిటీ ఛైర్మన్ భోజరాజు నాయక్

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులకు మతిభ్రమించిందని రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వి.భోజరాజునాయక్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. కాలవకు పచ్చ పిచ్చి నెత్తికెక్కి విప్ కాపు రామచంద్రారెడ్డిపైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాపు తన సొంత నిధులతో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. గతంలో కాలవ శ్రీనివాసులు అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డు నుంచి పింఛన్లు, ఇళ్ల పట్టాల వరకు జన్మభూమి కమిటీల ద్వారా మామూళ్లు వసూలు చేసి దండుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు అందరూ అలాగే ఉంటారని అనుకోవడం కాలవ బుద్ధి తక్కువ తనానికి నిదర్శనమన్నారు. ఆఖరికి తిరుపతి దర్శనానికి ఇచ్చే సిఫారసు లెటర్లను రూ.500 అమ్ముకున్న నీచ చరిత్ర కాలవది అన్నారు. ఎవరు ప్రజల కోసం కష్టం పడుతున్నారో, ఎవరు దోచుకోవడానికి రాయదుర్గానికి వలస వచ్చారో ప్రజలకు బాగా తెలుసన్నారు. కాలవ మోసపు మాటలను నమ్మేవాళ్లు ఇక్కడ ఎవ్వరూ లేరన్నారు. కాలవ శ్రీనివాసులు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని వాస్తవాలు మాట్లాడాలని, లేకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

మొక్కజొన్న పంటకు నిప్పు



పూర్తిగా కాలి బూడిదైన జొన్నపంట

ఉరవకొండ : మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకుని దాదాపు రూ.3 లక్షల నష్టం వాటిల్లిన ఘటన గురువారం విడపనకల్ మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వేల్పుమడుగు గ్రామానికి చెందిన రైతు నాగరాజు రెడ్డి నాలుగెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. ఈనేపథ్యంలో గురువారం జిబిసి కాలువ గట్టుపై ఉన్న గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో మంటలు వ్యాపిస్తూ సమీపంలోని సాగు చేసిన మొక్కజొన్న పంటకు మంటలు వ్యాప్తించి పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సర్పంచి తిప్పారెడ్డి ఉరవకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే వచ్చి మంటలార్పారు. నష్టపోయిన రైతును ప్రభుత్వమే ఆదుకోవాలని సర్పంచి తిప్పారెడ్డి కోరారు.

గుండెపోటుతో సిపిఐ నాయకుడు మృతి

యాడికి : మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సిపిఐ నాయకుడు వెంకటేష్ (53) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వెంకటేష్ కమ్యూనిస్టు పార్టీలో చేరి ఎంతోమంది ప్రజలకు సేవ చేశాడు. ఈయను భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఉప సర్పంచి కాసా చంద్రమోహన్, తదితరులు వెంకటేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పింపచారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు

ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని కోట ప్రాంతంలో వెలసిన శ్రీ రామస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రామాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీతారాములకు అర్చకులు కమనీయంగా కళ్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ రామస్వామి ఆలయం నిర్మాణానికి దేవాదాయ శాఖ ద్వారా రూ.కోటి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆలయం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో మున్సిపల్ నిధులతో పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆలయ వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకిలో ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఎంపిపి జి.విశాలాక్షి, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ మండల కన్వీనర్లు డి.మహాస్సేన్‌పీరా, జి.గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు నజీర్, రమణ, వరద, ఫారూఖ్, రామాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శివప్రసాద్, ఎంకె.చౌదరి, నాయకులు చక్రి, రామానాయుడు, శ్రీధర్, విజయభాస్కర్, శేషాచలపతి, దేవేంద్ర, చిన్ని, దాసా రమేష్ టిడిపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

అనంతలో సరికొత్త హలీం రుచులు

ఎంపైర్ హలీం అధినేత షబ్బీర్

ప్రజాశక్తి అనంతపురం

స్థానిక సుభాష్ రోడ్‌లోని ఎంపైర్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో సరికొత్త రుతులతో హలీం ప్రజలకు అందిస్తున్నట్లు అధినేత ఎస్ఎం షబ్బీర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా అనంతపురం ప్రజలకు ఎంపైర్ సరికొత్త రుచులతో చికెన్, మటన్ హలీమ్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అతేంటిక్ హలీం పేరుతో సరికొత్త ధనంతో అద్భుతమైన రుచులను అందిస్తున్నట్లు వివరించారు. సుదీర్ఘకాలంగా సౌత్ ఇండియన్ నార్త్ ఇండియన్ రంగంలో అద్భుతమైన రుచులతో ఎప్పటికప్పుడు సరికొత్తదనంతో ఐటమ్స్ ను ప్రజలకు చేరువ చేస్తున్నట్టు తెలిపారు. 2011లో ప్రారంభమైన ఎంపైర్ ఫ్యామిలీ రెస్టారెంట్ అనంతపురంతో పాటు గుత్తిలోనూ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ నేపథ్యంలో ఉపవాస దీక్షలో ముస్లిములకు నాణ్యమైన హలీం అందించేందుకు నిష్ణాతులైన మాస్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ముస్లిములతోపాటు హిందువులు, క్రిస్టియన్ సైతం తమ హలీం ఇష్టపడుతున్నారన్నారు. అంతేగాకుండా తమ రెస్టారెంట్‌లో అనేకమైన నాన్ వేజ్ ఐటమ్స్ స్టార్టర్లు, చికెన్ దమ్ బిర్యానీ, స్పెషల్ చికెన్, మటన్ బిర్యానీ, స్పెషల్ కాశ్మీరీ బిర్యానీతోపాటు ఇరానీ చాయ్ వంటి సౌలభ్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ అందిస్తున్న సేవలను ఆదరిస్తున్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు హలీం అందుబాటులో ఉంటుందన్నారు.



హలీంకోసం ఎగబడుతున్న జనం, అధినేత షబ్బీర్



పానకం పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు

అనంతపురం కలెక్టరేట్ : శ్రీరామ నవమి వేడుకలు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం 49వ డివిజన్ 6వ రోడ్డు, ఇందిరా నగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీరామ నవమి వేడుకలకు సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, వెంకటనారాయణ తదితరులు హాజరై పానకాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రసాద్, రాజు, రాము సంజీవులు, చిరంజీవి, సాంబ, వెంకటేష్, వీరాంజనేయులు, అమీర్ భాష, రామాంజి, నూర్ బాషా, ఆంజనేయులు, సురేష్, మోహన్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న బాషా

అనంతపురం : స్థానిక భైరవనగర్‌లోని గురు రాఘవేంద్ర వృద్ధాశ్రమంలో ఫ్రెండ్స్ సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రసాద్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ఉచిత వక్త శిక్షణ శిబిరం

అనంతపురం : స్టెప్ (స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్) జాతీయ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు నాయకత్వంలో ఏప్రిల్ 8, 9వ తేదీల్లో విజయవాడలో ఉచిత వక్త శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు స్టెప్ రాష్ట్ర సమితి సభ్యుడు పి.సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువకుల్లో ఉన్న అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మంచి వక్తలుగా మారాలని కోరుకునేవారు ఉపయోగించుకోవాలని కోరారు.

గేట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుత్తి

సాంకేతిక సింపోజియంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. నగరంలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో ఈ మెర్జ్ అనే పేరుతో సాంకేతిక సింపోజియం నిర్వహించారు. సింపోజియానికి దాదాపు 100 ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. అందులో భాగంగా గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం ఈసీఈ చదువుతున్న బషీర్, జస్వంత్, మౌనిక ఉత్తమ ప్రతిభ కనబరిచారు. గేట్స్ విద్యార్థులు ప్రాజెక్టు ఎక్స్‌పో అనే అంశంపై ఇచ్చిన ప్రజెంటేషన్‌కు ప్రథమ బహుమతి దక్కింది. ఉత్తమ ప్రతిభ చూపిన గేట్స్ విద్యార్థులకు జెఎన్‌టియు ఈసీఈ విభాగాల అధిపతి విష్ణువర్ధన్‌రెడ్డి బహుమతి అందజేశారు. గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఈసీఈ హెచ్‌ఓడిలు విజేతలను అభినందించారు.



బహుమతి అందుకుంటున్న గేట్స్ విద్యార్థులు

పరిటాల సునీత హయాంలో దోపిడీ

నకిలీ పట్టాలతో భూములు స్వాహా - ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి హయాంలో అప్పటి మంత్రి పరిటాల సునీత నకిలీ పట్టాలు సృష్టించి అనంతపురం చుట్టూ రూ.కోట్ల భూములను కొల్లగొట్టారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.200 కోట్ల విలువైన భూములను నకిలీ డాక్యుమెంట్లతో కబ్జా చేశారన్నారు. కొడిమి పొలంలో మూడు రోజుల కిందట జరిగిన కబ్జాను రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. భూ కబ్జాదారులపై గతంలోనే తాను ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ చెప్పానని గుర్తు చేశారు. ఆ తర్వాత ఎంతో కొంత స్పందించిన రెవెన్యూ అధికారులు కొన్ని భూములను ఆన్‌లైన్ నుంచి తొలిగించడంతోపాటు మరొకొన్ని భూములను రెడ్‌మార్క్‌లో ఉంచారన్నారు. ఇంకొన్ని భూములను రిజంషన్ చేశారన్నారు. అనంతపురం చుట్టూ ఉన్న భూకబ్జాదారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బందిపై తాను చేస్తున్న ఆరోపణలపై ప్రజలు కూడా స్పందించాలని పిలుపునిచ్చారు. ఎందుకంటే తాను అవినీతి, దుర్మార్గం, అక్రమార్కులపై పోరాటం చేస్తున్నానన్నారు. కొడిమి జగనన్నకాలనీ పక్కన, కురుగుంట వైఎస్ఆర్ కాలనీ పక్కన, ఉప్పరపల్లి, సోములదొడ్డి ప్రాంతాల్లో విలువైన భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. ఇందులో రెవెన్యూ అధికారుల సహకారం చాలానే ఉందన్నారు. మాజీ సైనికుల పేరుతో ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి అమ్ముకుంటున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా లోకేష్ పాదయాత్రపై విలేకరులు ప్రశ్నించగా 'రాప్తాడుకు చాలామంది వస్తుంటారు.. పోతుంటారు.. కానీ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఒక్కడే ఇక్కడ లోకల్..' అని స్పందించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాతి దూలం లాగుడు పోటీలు

ప్రజాశక్తి-పుట్లూరు

శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని రంగనాయనిపల్లె గ్రామంలో గురువారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.30వేలు, మూడవ బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ.10వేల బహుమతి ఇచ్చారు. అనంతరం త్రో బాల్, తదితర ఆటల పోటీలు కూడా నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

3న పింఛన్ల పంపిణీ

నార్పల : వచ్చేనెల 3న సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఓ దివాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగింపు, ఏప్రిల్ 1వ తారీకు నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం కారణంగా 3వ తేదీన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

యాడికి : ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 14 ద్విచక్ర వాహనాలకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు పది శాతం ధరావతు సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు. పాల్గొనాలనుకునేవారు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని వెంట తీసుకుని రావాలని కోరారు.

సిఐ యుగంధర్‌తో ప్రాణహాని

ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం సిఐ యుగంధర్‌తో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్ విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కోతిగుట్ట ప్రాంతంలో ఉన్న 295-2 సర్వే నెంబర్‌లో కొంత ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీన్ని అంబేద్కర్ భవనంతోపాటు సంఘం కార్యాలయానికి కేటాయించాలని ఏడాదిగా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగితే తమకు అప్పగించారన్నారు. దీంతో తాము సంబంధిత స్థలంలో జెండాలు పాతామన్నారు. అయితే రెండు రోజుల కిందట జెండాలను గొల్ల సామాజిక వర్గానికి సంబంధించిన కొందరు వ్యక్తులు పీకి కాల్చేశారన్నారు. వెంటనే తమకు వచ్చిన సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించి సిఐ యుగంధర్‌కి ఫిర్యాదు చేశామన్నారు. అంతేగాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించామన్నారు. సాయంత్రం వెళ్లి కేసు కట్టాలని అడిగితే దుర్భాషలాడారన్నారు. చేసేదిలేక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మౌన దీక్ష చేస్తుంటే కులం పేరుతో దూషిస్తూ సాయంత్రం 7:40 నిమిషాలకు ప్రయివేట్ వాహనం తెప్పించి గుట్టలు, వంకల చుట్టూ తిప్పి రాత్రి 11 గంటలకు కనేకల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టడానికి ప్రయత్నం చేశారన్నారు. తర్వాత రాత్రి 12 గంటలకు రాయదుర్గంలో వదిలేసి వెళ్లిపోయారని వాపోయారు. సిఐ యుగంధర్‌తో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు వన్నూరుస్వామి, పెన్నప్ప, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు ఉలిగప్ప, మహిళా నాయకురాలు గంగమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకులు భీమరాజు, రూపేష్, మల్లేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్



ఎన్‌మ్యాక్స్ థియేటర్ ముందు ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు

సినిమా థియేటర్లలో ఆటోల పార్కింగ్‌కు అనుమతించాలి

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని సినిమా థియేటర్లలో ఆటోల పార్కింగ్ కోసం అనుమతించాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నీలిమా సర్కిల్‌ని ఎన్ మ్యాక్స్ థియేటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డితోపాటు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ థియేటర్లలో ఆటోల పార్కింగ్ నిషేధిస్తూ యాజమాన్యం ఏర్పాటు చేసిన నో పర్మిషన్ బోర్డును తక్షణం ఎత్తివేయాలన్నారు. థియేటర్‌లలో ఆటోలకు పార్కింగ్ అనుమతించాలని స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. 20 సంవత్సరాల నుంచి ఆటో డ్రైవర్లు కుటుంబాలతో వెళ్లినా.. ఒంటరిగా వెళ్లినా ఆటోలను సినిమా థియేటర్ ఆవరణంలో పార్కింగ్ స్థలంలో పెట్టే అవకాశం ఉండేదన్నారు. అయితే ఎనిమిది రోజుల క్రితం నుంచి సినిమా థియేటర్ యాజమాన్యం అందరూ ఆటోలను అనుమతించబడదంటూ అన్ని థియేటర్లలో బోర్డులు పెట్టడం బాధాకరమన్నారు. ఇలాంటి చర్యలతో ఆటో డ్రైవర్ల పట్ల వివక్ష చూపడం అవుతుందన్నారు. కుటుంబ సభ్యులో ఆటో డ్రైవర్ సినిమాలకు రాకూడదా.. అంటూ ప్రశ్నించారు. కార్లు, బైకులు ఉంటేనే సినిమాలకు అనుమతిస్తామంటే పేదలు, కార్మికులు కూడా ఉంటారన్న విషయాన్ని యాజమాన్యం గుర్తించాలన్నారు. యాజమాన్యం స్పందించి ఆటోలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర నాయకులు ఆజాం, నాగరాజు, ఆదినారాయణ, సోమప్ప, చంద్రశేఖర్, ఆర్టిసి బస్టాండ్ సర్కిల్ యూనియన్ నాయకులు నాగరాజు, ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయవాది కె.సురేష్‌రెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.సురేష్‌రెడ్డిని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి గురువారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్జికి పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

ఘనంగా పాఠశాల ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

స్థానిక ఓబళాచారి రోడ్డులో ఉన్న సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆవిర్భావ దినోత్సవాన్ని అధ్యక్షులు పొరాళు ధనార్ధన ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆహూతులను అలరించారు. తర్వాత కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం హైదరాబాదులో ఇటీవల నిర్వహించిన వైజ్ఞానిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గౌని ప్రతాపరెడ్డి, ప్రధానోపాధ్యాయులు చిత్రయ్య, పదవీ విరమణ ప్రధానోపాధ్యాయులు ఎన్.ఎర్రిస్వామి, పాఠశాల కార్యదర్శి కె.తుకారాం, సహ కార్యదర్శి రామాంజనేయులు, పాఠశాల సమితి కార్యదర్శి సోమ నీలకంఠ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి, ఉపాధ్యాయిని చంద్రకళ, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం





శ్రీరామనవమిని పురస్కరించుకుని నగరంలోని రెవెన్యూ కాలనీలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు, ఉరవకొండలో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రెవెన్యూ కాలనీలో శ్రీరామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతా రాముల కళ్యాణోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నిర్వాహకులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, సి.క్రిష్ణమూర్తి, సోమసుందరం, గురుమూర్తి రెడ్డి, భర్, రాజేశ్వరి, రేణుక, దివాకర్, బాల రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని పాతూరు 10వ డివిజన్‌లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీరాముడి చిత్రపటానికి పూజలు చేసి ప్రసాదాలు, పానకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, వెంకటేష్‌గౌడ్, నూర్, విజయ్, దుర్గా, వసంతకుమారి, నాగరాజు, రఘురామయ్య, సాయికుమార్, గంగాధర్, వడ్డే ప్రసాద్, నాగభూషణం, అశోక్‌ప్రసాద్, రాము, కిరణ్, దిలీప్ బాషా, మధు, అప్పన్న, రంగా, వెంకటేశులు, బీరువాల సూరి, లక్ష్మన్న గౌడ్, టైలర్ మోహన్, రామదాసు, సిపిఐ నాయకులు లింగమయ్య, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు నార్పల సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచి స్వాతిలత దంపతులు పీటలపై కూర్చొని సీతారాముల కళ్యాణం జరిపించారు. వేడుకను తిలకించడానికి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పును పంపిణీ చేశారు. సాయంత్రం సీతారామ, లక్ష్మణ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని ఆలయంలో సీతారామ కళ్యాణోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా పుట్లూరు, ఎల్లుట్ల, కడవకల్లు తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ముందుగా సీతారామ కళ్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, పానకాలు పంపిణీ చేశారు.

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంతోపాటు ఎల్‌బి.నగర్, ఉద్దేహాల్, మేంకల్, తదితర గ్రామాల్లోని ఆలయాలో సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. కళ్యాణానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు పానకం, వడపప్పు అందజేశారు.

గుత్తి : పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో గురుపాద స్వామి నివాసం వద్ద శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జి.నర్సారెడ్డి జి.రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుపాద స్వామి దంపతులు, జి.నర్సారెడ్డి దంపతులు, రవి శేఖర్‌రెడ్డి, మధుమతి, మౌర్య వర్ధన్‌రెడ్డి, లేఖన, స్నేహారెడ్డి జెజిత్‌రెడ్డి అనురాధ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వివిధ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. అన్నదానం చేశారు.

ఉరవకొండ : నియోజకవర్గంలోని విడపనకల్ ఉరవకొండ వజ్రకరూరు తదితర మండలాల వ్యాప్తంగా గురువారం శ్రీరామనవమి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీరాముని అలయాలతో పాటు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉరవకొండ పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయం, పార్క్ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని బూదగవి తదితర గ్రామాల్లో విడపనకల్ మండల పరిధిలోని చీకులగురికి గ్రామంలో వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి మధుసూదన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వజ్రకరూరు మండల పరిధిలోని పందికుంట గ్రామంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవమ్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల కళ్యాణం కమణీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలోని పలు గ్రామాలలో సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బెలుగుప్ప, నక్కలపల్లి గ్రామాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల సీతారాముల కళ్యాణం కమనీయంగా చేశారు. కళ్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తిలకించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానం చేశారు. సాయంత్రం సీతారాముల విగ్రహాలను ఊరేగించారు.

రాయదుర్గం : పట్టణ సమీపంలోని ఎల్లమ్మ కొండపై ఉన్న పట్టాభి సీతారామస్వామి ఆలయంలో గురువారం సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయదుర్గం పురపాలక సంఘ అధ్యక్షులు పొరాలు శిల్ప, మాజీ అధ్యక్షులు ముదిగల్లు జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దబ్బడి మంజునాథ, కోశాధికారి లక్ష్మణ, ఉపాధ్యక్షులు కే మంజునాథ, సభ్యులు లోకేష్, కిరణ్ తదితరులు కళ్యాణోత్సవాన్ని పర్యవేక్షించారు. వందలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కాగా రాయదుర్గం పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న కోదండ రామాలయంలో, ఉక్కడ ఆంజనేయ స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



యల్లనూరు మండలం తిరుమలాపురంలో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న సర్పంచి రామాంజనరెడ్డి, గ్రామస్థులు



రాయదుర్గంలో పూజలు అందుకున్న సీతారాములు

పెద్దపప్పూరు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు.

యల్లనూరు : మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో గురువారం ఘనంగా సీతారాముల కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా స్థానిక సర్పంచి రామాంజనరెడ్డి ఇంటి నుంచి రాములూరి కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ వస్త్రాలతోనే సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించినట్లు సర్పంచి తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణంతోపాటు గ్రామ ప్రజలందరూ ఐక్యమై సీతారాముల కల్యాణాన్ని నిర్వహించామని తెలిపారు. తెలుగు సంవత్సరాది మొదటి వారం కావున రాబోవు రోజుల్లో పంటు సమృద్ధిగా పండి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





శ్రీరామనవమిని పురస్కరించుకుని బెలుగుప్ప, గుత్తిలో సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు